
గెలుస్తాం : కాకినాడలో పవన్‌తో అభ్యర్థుల సమైక్య నినాదం
నీ కష్టం తీరుస్తా : రైతుతో పవన్


ఈ జెండా ఎగరనివ్వొద్దు : వైసీపీ జెండాలు మడతపెట్టి ఇంటిబాటపట్టిన మహిళలు


సభలో మాట్లాడుతున్న జగన్



బాబోయ్.. జగన్!

- జగన్ సభ నుంచి జనం పరుగో పరుగు
- ప్రజలకు ప్రత్యక్ష నరకం చూపించిన సీఎం
- నన్ను గెలిపించకపోతే డబ్బులు రావని బెదిరింపు
- కన్నీళ్లు పెట్టుకున్న ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత

పిఠాపురం, మే 11 : జగన్ ఇలా ఇలా అనాలని చెబుతుంటే..జనం మాత్రం అలా అలా అంటూ పరుగులు తీశారు. ప్రసంగం ప్రారంభించగానే సభ నుంచి పెద్ద ఎత్తున మహిళలు తిరుగుముఖం పట్టారు. వారిని ఆపేందుకు నేతలు ప్రయత్నించి విఫలమయ్యారు.మరోవైపు సీఎం సభ పిఠాపురం ప్రజలకు ప్రత్యక్ష నరకాన్ని చూపించింది. నడిచి వెళ్లేవారిని సైతం పోలీసులు అడ్డుకున్నారు. దుకాణాలను సైతం మూయించివేశారు.సభకు రెండు కిలోమీటర్ల దూరంలోనూ బారికేడ్లు ఏర్పాటు చేసి ప్రజలను ముప్పుతిప్పలు పెట్టారు. యథావిధిగా సీఎం జగన్ అబద్ధాలు వల్లేవేశారు. వంగా గీతను గెలిపిస్తే డిప్యూటీ సీఎంను చేస్తానని ప్రకటించారు. అది కూడా డిప్యూటీ సీఐ అంటూ ఉదహరించడం ఆశ్చర్యపరిచింది.తనను గెలిపించకపోతే బటన్ నొక్కిన పథకాల నిధులు రావంటూ ప్రజలను బెదిరించే ప్రయత్నం చేశారు. పవన్‌కల్యాణ్‌పై వ్యక్తిగతంగా విమర్శలు చేశారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పోటీ చేస్తున్న పిఠాపురం నియోజకవర్గాన్ని తన ఎన్నికల ఆఖరి ప్రచార సభ కోసం సీఎం జగన్ ఎంచుకున్నారు.శనివారం మధ్యాహ్నం 2.55 గంటలకు పిఠాపురం రావాల్సిన జగన్ గంటకు పైగా ఆలస్యంగా ఇక్కడకు చేరుకున్నారు. నేరుగా బస్సులో ఉప్పాడ సెంటర్‌కు చేరుకుని అక్కడ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. అన్ని సభల్లో మాదిరిగా గత మేనిఫెస్టో 99 శాతం అమలుచేశానంటూ గొప్పలు చెప్పుకున్నారు. చంద్రబాబు 14 ఏళ్ల సీఎంగా ప్రజలకు మంచి చేసే ఒక్క పనిచేయలేదంటూ వారిని నమ్మించే ప్రయత్నంచేశారు. 60 నెలలు సీఎంగా మీరు అవకాశం ఇచ్చారు, కానీ 57 నెలలకే నా గొంతు నొక్కేశారంటూ వాపోయారు. పవన్‌పై వ్యక్తిగత విమర్శలు చేయడంతో జనం అసహనం వ్యక్తం చేశారు. సీఎం ప్రసంగం పూర్తయ్యేసరికి సభాప్రాంగణం సగానికి పైగా ఖాళీ అయింది. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీతావిశ్వనాథ్ నా పుట్టుక పిఠాపురం కాదంటూ అవమానకరంగా మాట్లాడుతున్నారని, నన్ను పిఠాపురం ప్రజలు నుంచి దూరం చేయాలని చూస్తున్నారు. నా బిడ్డ సాక్షిగా చెబుతున్నా ఇక పిఠాపురం వదిలివెళ్లనన్నారు.నా అంతిమ సంస్కారాలు పిఠాపురం పాదగయ క్షేత్రం చెంతనే చేయాలని కోరుకుంటున్నా అని కన్నీరు పెట్టుకున్నారు. సీఎం జగన్ సభకు జనసమీకరణకు వైసీపీ నేతలు అష్టకష్టాలు పడ్డారు. వచ్చినవారికి రూ.300, బిరియాని ప్యాకెట్లు ఇచ్చినట్టు చెబుతున్నారు. మద్యాన్ని కూడా పంపిణీ చేశారు. సీఎం సభ జరిగే ప్రాంతంలోనే కాకుండా ఇటు కోటగుమ్మం సెంటర్ వరకూ, ఉప్పాడ రైల్వేగేటు వరకూ షాపులు మూసివేయించారు.తినేందుకు, తాగేందుకు ఏమి దొరకక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సీఎం సభతో ప్రజలు నరకయాతన అనుభవించారు. పిఠాపురం పట్టణంలోకి ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలను అనుమతించలేదు. అన్ని వాహనాలను బైపాస్‌రోడ్డు మీదుగా మళ్లించారు. దీంతో పిఠాపురం పట్టణంలోకి వచ్చేవారు, కొత్తపల్లి మండలానికి వెళ్లవలసిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బైపాస్ రోడ్డు నుంచి రెండు,మూడు కిలోమీటర్లు నడవాల్సి వచ్చింది. సభ వద్ద ప్రజల కంటే పోలీసులు సంఖ్య అధికంగా కనిపించింది. ఏకంగా 1300 మంది పోలీసులను బందోబస్తు నిమిత్తం వినియోగించారు. సభలో కాకినాడ వైసీపీ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు,మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.


జనాలను తెచ్చి.. ఎండలో వదిలేసి : మూసివేయించిన షాపుల వద్ద వేచి ఉన్న మహిళలు


అభిమానంతో ఆశీర్వదించండి : కాకినాడలో ఎన్నికల చివరి బహిరంగ సభలో పవన్

గెలుపు మనదే

వైసీపీ అభ్యర్థులను ఓడించండి..

- పేట్రేగిన ద్వారంపూడి అక్రమాలు
- అధికారమిస్తే.. అంతు చూస్తా
- జనసేన అధినేత పవన్‌కల్యాణ్

కలెక్టరేట్(కాకినాడ),మే 11 : కాకినాడ నగరాన్ని రౌడీల రాజ్యంగా తయారు చేసి ప్రజలకు భద్రత లేకుండా చేసిన ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖ రరెడ్డిని ఎన్నికల్లో చిత్తు చిత్తుగా ఓడించాలని జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ పిలుపునిచ్చారు. కాకినాడ బాలాజీ చెరువు సెంటర్‌లో శనివారం జనసేన,టీడీపీ, బీజేపీ కూటమి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల చివరి బహిరంగ సభలో పవన్ మాట్లాడారు. ద్వారంపూడి కాకినాడను గంజాయికి కేపిటల్‌గా మార్చేసి యువత జీవితాలతో ఆడుకుంటున్నారన్నారు.పచ్చటి మడ అడవు లను ధ్వంసం చేశారని ధ్వజమెత్తారు. అక్రమంగా బియ్యం రవాణా.. ఆయిల్ మాఫియా ద్వారా కోట్లు ఆర్జిస్తున్నారని విమర్శించారు. కాకినాడలో పేకాట క్లబ్‌లను నడుపుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని విమర్శించారు.ద్వారంపూడి అనుచరులు భూకబ్జాలకు పాల్పడుతూ ప్రజల ను భయభ్రాంతులకు గురిచేస్తున్నారనీ..ఇలాంటి తరుణంలో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో మరిన్ని అక్రమాలు చేస్తారని హెచ్చరించారు.ద్వారంపూడి తండ్రి సివిల్ సప్లయిస్ ఛైర్మన్‌గా,తమ్ముడు రైస్‌మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉండి అనేక విధాలుగా ఈ కుటుంబం దోచుకుందని ఆరోపించారు. ఇలాంటి ద్వారంపూడిని ఈ ఎన్నికల్లో చిత్తుగా ఓడించకపోతే కాకినాడ నగరానికి భవిష్యత్తు ఉండదన్నారు. కూటమి అధికా రంలోకి వచ్చిన తర్వాత ద్వారంపూడిని నడిరోడ్డుపై మోకాళ్లపై కూర్చోబెట్టి నడిపిస్తానని హెచ్చరించారు.కాకినాడలో ఆడబిడ్డలు రోడ్డుపై తిరగాలంటే భయపడుతు న్నారని..దీనికి కాకినాడలో ద్వారంపూడికి చెందిన బ్లేడు బ్యాచే కారణమని ఆరోపించా రు.యువత ధైర్యంగా ఓటేసి ద్వారంపూడి వంటి రౌడీలను ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చా రు.రోజుకోపార్టీ మారుతున్న వైసీపీ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌ను ఓడించాలన్నారు. కాకినాడ పార్లమెంట్ జనసేన కూటమి అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, కాకినాడ రూరల్,సిటీ అసెంబ్లీ కూటమి అభ్యర్థులు పంతం నానాజీ,వనమాడి కొండబాబులను గెలిపించాలని అభ్యర్థించారు.




జనం కోసం ఎంతకైనా దిగొస్తా : చేబ్రోలులో పాదయాత్రగా వస్తున్న పవన్‌కల్యాణ్, వర్మ

దుర్గాడలో పవన్ రోడ్ షో

పిఠాపురం/గొల్లప్రోలు రూరల్, మే 11 : ప్రజలతో కలిసి నడుస్తూ.. సమస్యలు అడిగి తెలుసుకుంటూ..యువతను అక్కున చేర్చుకుంటూ పిఠాపురంలో జనసేన అధినేత పవన్ చివరి ఎన్నికల ప్రచారం చేశారు.గొల్లప్రోలు మండలం దుర్గాడలో శనివారం మాజీ ఎమ్మెల్యే వర్మతో కలిసి రోడ్‌షో నిర్వహించారు. అడుగడుగునా జననీరాజనం పలికారు.చేబ్రోలు వై.జంక్షన్ నుంచి బైపాస్‌రోడ్డులోని తన నివాసం వరకూ పాదయాత్రగా నడిచారు.గాజుగ్లాసు గుర్తుపై ఓటేసి తనను గెలిపించాలని కోరారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు బాధితుడనంటూ ప్లకార్డు ప్రదర్శించిన దుర్గాడకు చెందిన గంగాధర్‌తో కలిసి నడిచారు. మెగా పవర్‌స్టార్ రామచరణ్, తన తల్లి సురేఖ, ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్‌లతో కలిసి పిఠాపురం పాదగయక్షేత్రంలోని విఘ్నేశ్వరస్వామి,దత్తాత్రేయస్వామి, పురుహూతికాఅమ్మవారు, కుక్కుటేశ్వరస్వామి,రాజరాజేశ్వరీదేవిలను దర్శించుకున్నారు.


బాబాయ్‌ని గెలిపించండి పిఠాపురంలో అభిమానులకు రామ్‌చరణ్ అభివాదం


తమ అభిమాన నాయకుడిని చూడాలని : పవన్ కోసం వేచిఉన్న దుర్గాడ ప్రజలు

ఓటు.. నోటు

- పోలింగ్‌కు ఒకరోజే ఉండడంతో జిల్లాలో అధికార వైసీపీకి ఓటమి జ్వరం
- ఎలాగైనా ఓట్లు కోసం కోట్లకు కోట్లు, నోట్లు వెదజల్లుతున్న వైనం
- పిఠాపురంలో పవన్ ఓటమే లక్ష్యంగా ఓటుకు రూ.4వేలు ఇస్తున్న వైసీపీ
- పెద్దాపురం, తుని, కాకినాడ రూరల్, కాకినాడ సిటీల్లో రూ.2వేల చొప్పున..

ప్రచారానికి తెర

కాకినాడ సిటీ, మే 11: సార్వత్రిక ఎన్నికల ప్రచార ఘట్టం ముగిసింది. అలసిసొలసిన అభ్యర్థులు, నేతలు, కార్యకర్తలు కాస్త రిలీఫ్ అయ్యారు. కానీ వారిలో టెన్షన్ ఇంకా తగ్గలేదు. మార్చి 16న ఎన్నికల షెడ్యూల్ మొదలైనప్పటి నుంచీ వారంతా ప్రజా క్షేత్రంలోనే ఉన్నారు. అభ్యర్థులుగా ఖరారైన తర్వాత టీడీపీ, జనసేన, బీజేపీ, వైసీపీ, కాంగ్రెస్ నేతలు క్షణం తీరిక లేకుండా ప్రచారం చేశారు. చివరిరోజున మరింత ఉధృతంగా ప్రచారం చేశారు. పిఠాపురంలో జనసేన అధినేత పవన్ రోడ్‌షో, మెగాపవర్‌స్టార్ రామ్‌చరణ్ రాకతో అభిమానులు భారీగా ఆయన్ను చూసేందుకు తరలివెళ్లారు. కాకినాడలో ఎన్నికల ముందు చివరిరోజున పవన్‌కల్యాణ్ సభ జరిగింది. పిఠాపురంలో జగన్ సభ జరిగింది. శనివారం సాయంత్రం ఆరు గంటలకు ప్రచార ముగియగానే ప్రలోభాలకు తెరదీశారు.

ద్వారంపూడి వారసుడిని ఎత్తుకుని.. ఓ ఆడబిడ్డ న్యాయం కోసం తిరుగుతోంది

13న ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు సెలవు: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), మే 11: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఈనెల 13న జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ జె.నివాస్ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన వెలువరించారు. ఎన్నికలకమిషన్ నిబంధనల ప్రకారం జిల్లాలో అన్ని సంస్థలు తప్పనిసరిగా సెలవు పాటించాలని ఆదేశించారు.దుకాణాలు, పరిశ్రమలు, ప్రైవేటుసంస్థల్లో ఉద్యోగులు తప్పనిసరిగా ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. కార్మికులకు వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలన్నారు.

సిబ్బంది రిపోర్ట్‌లపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలి: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), మే 11: జిల్లా కంట్రోల్ రూమ్‌లో పనిచేస్తున్న సిబ్బంది రిపోర్టులపై ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించాలని కలెక్టర్ జె.నివాస్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్ సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 13న జరిగే పోలింగ్ శాతాన్ని ప్రతి 2గంటలకు నమోదు చేయాలన్నారు. సెక్టార్‌వారీగా నియమించిన ప్రత్యేక బృందాలు సేకరించిన సమాచారాన్ని కన్సాలిడేట్ చేసి అందించాలన్నారు. రిటర్నింగ్‌అధికారులు, సెక్టార్ అధి కారులు, రూట్ ఆఫీసర్లతో ఫోన్‌లో మాట్లాడి పోల్ పర్సంటేజ్ తెలుసుకోవాలన్నారు.



ఓటు నోటు

అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌కు ఇంకా ఒకరోజే ఉండడంతో వైసీపీ పూర్తిగా బరితెగించేసింది. ఓడిపోతున్నామన్న భయంతో అడ్డగోలుగా వ్యవహరిస్తోంది. జనం ఎలాగూ తమకు ఓట్లు వేయరన్న భయంతో నేరుగా కోట్ల కట్టలతో పంపకాలు చేస్తోంది. గ్రామాల్లో రాజీనామా చేసిన వలంటీర్లను వెంటబెట్టుకుని ఓట్లను కొనుగోలు చేస్తోంది. ఓటుకు నియోజకవర్గం బట్టి రూ.3వేల నుంచి రూ.2వేల వరకు పంచుతోంది. ఇంట్లో ఎంతమంది ఓటర్లు ఉంటే అంతమందికి డబ్బులు చదివిస్తోంది. అటు వెండి గిన్నెలు,కుంకుమ భరిణిలు ఇచ్చి ఓట్లు కొనుగోలుకు బరితెగిస్తోంది.



కోనసీమలో ప్రలోభాలు



అమలాపురం టౌన్, మే 11: సార్వత్రిక ఎన్నికల్లో అక్రమాలు జరగకుండా వేయికళ్లతో చూడాల్సిన 'నిఘా' వ్యవస్థ నిద్రపోయింది. ఫలితంగా ఓటర్ల ప్రలోభ చర్యలు పబ్లిక్‌గా సాగిపోతున్నాయి. ఎన్నికల విధుల పేరుతో బిజీగా ఉన్న అధికార యంత్రాంగం ప్రలోభ చర్యలను పట్టించుకోకపోవడంతో రాజకీయ పార్టీలు పేట్రేగిపోతున్నాయి. రెండు రోజులుగా కోట్లాది రూపాయలు చేతులు మారుతున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి నగదును రహస్యంగా తరలించి ఓటర్ల ప్రలోభానికి వినియోగిస్తున్నారు. కాగా పబ్లిక్‌గా ఓటర్లకు నగదు, కానుకలతో పాటు పురుషులకు తాగినంత మద్యాన్ని పంపిణీ చేస్తూ తమ భవితవ్యానికి బంగారు బాట వేయాల్సిందిగా ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో లోక్‌సభ, అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తున్న టీడీపీ, వైసీపీ అభ్యర్థులు ఓటర్లను ప్రలోభపెట్టే పర్వానికి తెరలేపారు. కోనసీమలోని అన్ని ప్రాంతాల్లో మద్యం ఓటర్లకు సరఫరా అవుతూనే ఉంది. ఇంటింటికీ తిరిగి బహిరంగంగా ఓటరు స్లిప్పులతో పాటు రూ.1,500 నుంచి రూ.2వేలు వంతున నగదు పంపిణీని వైసీపీ నాయకులు అప్పుడే రహస్యంగా పూర్తి చేసినట్టు తెలిసింది. అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో వైసీపీ తరపున రూ.1,500 నుంచి రూ.2వేల వరకు నగదు పంపిణీ చేశారు. గత ఎన్నికల కంటే ఈ సారి ఖర్చు పెరిగిందని ఆ పార్టీల నేతలే వాపోతున్నారు. గతంలో జరిగిన ఎన్నికల్లో త్రిముఖపోటీ జరగ్గా ఒక సామాజికవర్గానికి పూర్తిగా రెండు ప్రధాన పార్టీలు నగదు చెల్లించలేదు. ఈసారి ఎన్నికల్లో ఆ సామాజికవర్గానికి రెండు పార్టీల వారు అదనంగా నగదు పంపిణీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాజకీయ పార్టీల శిబిరాల నుంచి లక్షలాది రూపాయల నగదు చేతులు మారుతుండడంతో పాటు రవాణా అవుతున్న ఈసారి నిఘా బృందాలు పెద్దగా దృష్టి సారించలేదు. అమలాపురం లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని అమలాపురం, గన్నవరం, రాజోలు, కొత్తపేట, ముమ్మిడివరం, రామచంద్రపురం, మండపేట అసెంబ్లీ నియోజక వర్గాల్లో ఆయా పార్టీల అభ్యర్థుల తరపున రూ.వెయ్యి నుంచి రూ.2వేలు వంతున ఓటర్లకు పంపిణీ చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో మహిళలకు అదనంగా చీరలు కూడా పంపిణీ చేశారు. విజయంపై ధీమాతో ఓటర్లకు నేరుగా పంపిణీ చేయకుండా కొందరు నాయకులు సొమ్ముల స్వాహా పనిలో రంగంలోకి దిగారు.ఈ తరహా పరిస్థితి అన్ని నియోజకవర్గాల్లోనూ అన్ని పార్టీల్లోనూ ఉంది. ద్వితీయ శ్రేణి నాయకులు భారీగా సొమ్ములు స్వాహా చేస్తున్న తీరు పోటీలో ఉన్న అభ్యర్థులకు తీవ్ర ఆగ్రహానికి గురి చేస్తోంది. ముమ్మిడివరం నియోజకవర్గంలో అభ్యర్థులు భారీగా మద్యం, నగదు పంపిణీ చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరికొన్ని చోట్ల దళారులు ఈ పరిస్థితిని బాగా సొమ్ము చేసుకుంటున్నారు. తాము చెప్పినట్టు వినకపోతే ప్రత్యర్థి వర్గంతో చేతులు కలిపి నష్టం కలిగిస్తామంటూ హెచ్చరించి అభ్యర్థులకు ముచ్చెమటలు పట్టిస్తున్నారు. ఎక్కడికక్కడే పంపకాలు జరుగుతున్నప్పటికీ అధికారులు మాత్రం దాడులు చేయకపోవడంతో పట్టపగలే ఓటరు లిస్టులతో ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి మరీ పంపకాలు చేస్తున్నారు. శనివారం సాయంత్రానికే పంపిణీ పర్వం పూర్తి చేయడం విశేషం.

ఓటర్లను కొనేస్తున్నారు!



- పోలింగ్‌కు ఒకరోజే ఉండడంతో జిల్లాలో అధికార వైసీపీకి ఓటమి జ్వరం
- ఎక్కడికక్కడ నియోజకవర్గాల్లో ఎదురీదుతోన్న వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు
- ఎలాగైనా ఓట్లు కోసం కోట్లకు కోట్లు నోట్లు వెదజల్లుతోన్న వైనం
- పిఠాపురంలో పవన్ ఓటమే లక్ష్యంగా ఓటుకు రూ.4వేలు ఇస్తున్న వైసీపీ
- పెద్దాపురం,తుని,కాకినాడరూరల్,కాకినాడ సిటీల్లో రూ.2వేల చొప్పున..



(కాకినాడ,ఆంధ్రజ్యోతి): డబ్బులు ఇస్తే తప్ప పార్టీకి ఓట్లు పడవనే నిర్ణయానికి వచ్చి డబ్బు పంపకాల జాతర చేస్తోంది వైసీపీ. పిఠాపురంలో పవన్‌పై ఓటమి ఖాయమని అర్థమైపోవడంతో వైసీపీ రాక్షస ప్రయత్నం కొనసాగిస్తోంది. అందుకోసం యు.కొతపల్లి,పిఠాపురం, గొల్లప్రోలు రూరల్ ప్రాంతాల్లో ఏకంగా ఓటుకు రూ. 3 వేలు నుంచి 4 వేలు చొప్పున పంపిణీ చేస్తోంది. మత్స్యకార, ఎస్సీ గ్రామాల్లో రూ.4 వేలు పంచింది. ఇతర సామాజిక వర్గాలున్న ప్రాంతాల్లో రూ.3 వేల చొప్పున పంపిణీ చేస్తోంది. ఒక్క పిఠాపురంలో రూ.45 కోట్ల వరకు డబ్బులు వెచ్చిస్తోంది. కాకినాడ సిటీలో ఎమ్మెల్యే ద్వారంపూడికి ఓటమి బెంగ పట్టుకుంది. దీంతో వార్డుల్లో రూ.2 వేల వరకు పంపిణీ ప్రారంభించారు. ఇంటింటికి తన మనుషుల ద్వారా డబ్బులు, చీరలు పంపిణీ చేయిస్తున్నారు. కులసంఘాలు, ఇతర కీలక నేతలకు రూ.లక్ష చొప్పున ఇచ్చారు. కాకినాడ రూరల్‌లో ఎమ్మెల్యే కన్నబాబు అనుచరులు చీరతో పాటు ఓటుకు రూ.2వేలు వరకు వెదజల్లుతున్నారు. కుల సంఘాలకు రూ.లక్ష నుంచి రెండు లక్షల వరకు పంచుతున్నారు. ప్రత్తిపాడులో అభ్యర్థి వరుపుల సుబ్బారావును

ఎలాగైనా గట్టెక్కించడానికి ఎమ్మెల్సీ అనంతబాబు నోట్ల కట్టలనే నమ్ముకున్నారు. గ్రామాల్లో వెయ్యి, మండల కేంద్రాల్లో 2వేల చొప్పున అనుకన్నా వ్యతిరేకత తీవ్రంగా ఉండడంతో అందరికీ రూ.రెండు వేల వరకు పంపిణీ చేస్తున్నారు. తుని, జగ్గంపేటలో రూ.వెయ్యి, టీడీపీకి బాగా బలమున్న ప్రాంతాల్లో రూ.2వేల చొప్పున వెదజల్లుతున్నారు. పెద్దాపురంలో ఏమాత్రం సానుకూల ఫలితం కనిపించకపోవడంతో ఇక్కడ వైసీపీ ఓటుకు రూ.2 వేల వరకు గ్రామాల నుంచి పంచుకువస్తున్నారు. ప్రధానంగా నియోజకవర్గాల్లో కడప నుంచి వచ్చిన బృందాలు డబ్బులు,మద్యం పంపిణీ బాధ్యత తలకెత్తుకున్నాయి. వీరంతా స్థానికంగా రూ.20 వేలకు స్కూటీలు కొనుగోలు చేసి అందులోంచి డబ్బులు తరలిస్తున్నారు. అలాగే అనేక నియోజకవర్గాల్లో డబ్బును ఇప్పటికే సముద్రంలో బోట్ల ద్వారా కూడా పంపించారు.

నగదు..మందు..బిర్యానీ

పిఠాపురం, మే 11: ఎన్నికల ప్రచారం ముగియడంతో ప్రలోభాలకు తెరలేచింది. ఇప్పటికే పిఠాపురం నియోజకవర్గంలో ఓటుకు రూ.3 వేలు వంతున పంచుతున్న వైసీపీ నేతలు శనివారం రాత్రి నుంచి బిర్యానీ ప్యాకెట్లు, మద్యం పంపిణీ ప్రారంభించారు. కోరినంత మద్యాన్ని అందిస్తున్నారు. ఓటుకు డబ్బులు ఇవ్వడంతో పాటు వారి ఓటు వేస్తామని ప్రమాణం చేయించుకుంటున్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు, పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాల్లోని వార్డుల్లో బహిరంగంగానే డబ్బుల పంపిణీ జరుగుతున్నది. పలుచోట్ల సొమ్ములు పంపిణీ వ్యవహారంలో వివాదాలు చోటు చేసుకుంటున్నాయి. కొందరు చోటా మోటా నేతలతో పాటు కడప, చిత్తూరు జిల్లా నుంచి వచ్చిన నేతల వద్ద ఉంటున్న కొందరు నాయకులు భారీగా సొమ్ము నొక్కేసినట్లు ఆ పార్టీ నేతలే ఆరోపిస్తున్నారు. నియోజకవర్గంలో పలువురు వైసీపీ నేతలకు డబ్బులు ఇచ్చినట్లు నమోదు చేసి వాటిని తమ జేబుల్లో వేసినట్లు సమాచారం. ఓటర్లకు డబ్బులు పంపిణీ మాట ఎలా ఉన్నా ప్రస్తుతం వైసీపీ నేతల మధ్య ఈ సొమ్ముల వ్యవహారం చిచ్చుపెట్టింది.



రూ.500 నోటుదే హవా

పెద్దాపురం, మే 11 : ఎన్నికల ముందు రోజు అర్ధరాత్రి వరకూ డబ్బుతోనే అసలైన పని. ఎక్కడ చూసినా డబ్బు పంపణీపైనే చర్చ. పోలింగ్‌కు గడువు సమీపిస్తున్న కొద్దీ రాజకీయ నేతలు కంటిపై కునుకు లేకుండా పోతోంది. గత ఎన్నికల్లో హంగామా చేసిన రూ. 2 వేల నోటు ప్రస్తుతం కనుమరుగయ్యింది. ఇప్పుడు రూ.500 పెద్ద దిక్కు. ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత ఇప్పటికే గత కొన్నాళ్లుగా రూ.500 నోటు మార్కెట్లో కానరావడం లేదు. ప్రస్తుతం రూ.100, రూ.200 మాత్రమే కనిపిస్తున్నాయి. కరెన్సీలో రూ.500 నోటు పెద్దది కావడంతో లావాదేవీలకు సులభం. ఎన్నికల్లో రూ. 500 నోటు హవా నడుస్తోంది అంటున్నారు. డబ్బుతో పాటు మందుబాబుల కోసం మద్యం సీసాలను సమకూర్చుకుంటున్నారు. ఈనెల 11వ తేదీ రాత్రి 7 గంటల నుంచి 13 రాత్రి 7 గంటల వరకూ అధికారులు డ్రై డేగా ప్రకటించారు.

నాయకుల నొక్కుడు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి): ఎన్నికల వేళ ఓట్ల కొనుగోలు అనేది సాధారణ విషయంగా మారిపోయింది. యంత్రాంగం ఎంత హడావుడి చేసినా నోట్ల ప్రలోభం మాత్రం సాగుతూనే ఉంది. అయితే, ఈ నోట్ల పంపిణీ ఈసారి అభ్యర్థులకు సంకటంగా మారింది. ఓటరు లిస్టుల ప్రకారం బూత్‌ల వారీగా ఓటర్లకు డబ్బుల పంపిణీకి స్థానికంగా ఉండే నాయకులకు అభ్యర్థులు, పార్టీలు ఎన్నికల షెడ్యూల్‌కు ముందే డబ్బులు సర్దుబాటు చేశాయి. ఒక్కో ఓటుకు రూ.2500 నుంచి రూ.3వేల వరకూ పంచిపెడుతున్నారు. ఇదే ఇప్పుడు వ్యతిరేకతను కూడా తీసుకొస్తోంది. ఒక పోలింగ్ బూత్‌లో 100 మంది ఓటర్లు ఉన్నారంటే.. వారందరికీ ఇవ్వాలంటూ 'పైనుంచి' ఆయా అభ్యర్థులకు డబ్బులు పంపించారని తెలుస్తోంది. వైసీపీ ఒక్కో అభ్యర్థికి రూ.30 కోట్ల వరకూ పంపిందని చెబుతున్నారు. అయితే పోటీలో ఉన్న అభ్యర్థులు కొంత మందిని నియమించుకొని పంపిణీ అప్పగించారు. వీళ్ల వంద మందిలో పది మందికే ఇవ్వడం, అది కూడా వీధుల్లో ఇష్టానుసారం తిప్పడం వల్ల ఓటర్లు సహనం కోల్పోతున్నారు. డబ్బుల పంపిణీకి వచ్చిన ఆయా పార్టీల పంపిణీదారులు ఓటరు జాబితాలో పేర్లు సరిచూసుకుంటున్నారు. ఒక ఇంట్లో ఐదు ఓట్లు ఉంటే రెండింటికి డబ్బులు చేతిలో పెట్టి మిగతా వారికి డబ్బులు తీసుకొస్తామంటూ జారుకుంటున్నారు. కొన్ని వార్డులో ఓటర్లు డబ్బుల కోసం అమాయకంగా రేయింబవళ్లు ఎదురుచూస్తున్నారు. దీంతో ముఖ్యంగా మహిళల్లో తీవ్ర వ్యతిరేకత వస్తోంది. వీధుల్లో ఎక్కడ చూసినా గుంపులుగా జనం కనిపిస్తున్నారు. ఈసారి ఓటుకు రేటు ఎక్కువగా ఉండడంతో ఓటర్లు తమ ఓటు స్లిప్పులు పట్టుకొని తిరుగుతున్నారు. ఓ మధ్యతరగతి కుటుంబంలో నాలుగు ఓట్లు ఉంటే ఎలాలేదన్నా రూ.10 వేలు అయినా వస్తాయని ఆశపడుతున్నారు. అయితే స్థానిక నాయకులు పెద్ద మొత్తంలో సొమ్ములు నొక్కేయడంతో సమస్య తలెత్తుతోంది. కొందరు మహిళలు ఏకంగా అభ్యర్థుల ఇళ్లకు వెళ్లి నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఓ పార్టీపై అభిమానం ఉన్నా నోట్లు చేతిలో పడకపోవడంతో అది వ్యతిరేక ఓటుగా మారే అవకాశం లేకపోలేదు. కాగా.. పక్కా నిఘా ఏర్పాట్లు చేశాం.. ప్రలోభాలను సహించేది లేదంటూ యంత్రాంగం ఎంత ఊదరగొట్టినా.. రూ.500 నోట్లు ఆ మాటలను వెక్కిరిస్తున్నాయి. ఓటర్లకు రూ.500 నోట్లనే చేతికి ఇస్తున్నారు. అంటే ఓట్లు కొనడానికి ఆయా అభ్యర్థులకు రూ.500 నోట్లు భారీ సంఖ్యలో ఎలా సమకూరాయో, యంత్రాంగం కళ్లుగప్పి ఎక్కడ నిల్వ చేశారో అనేది ఇప్పుడు ఓ పెద్ద ప్రశ్నగా మిగిలిపోయింది.



మద్యం పంపిణీ ప్రారంభం

మద్యం ఇప్పటికే పెద్ద మొత్తంలో సమాకూర్చుకున్నారని తెలుస్తోంది. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం గత ఏడాది ఈ తేదీకి ఎంత మద్యం అమ్మకాలు జరిగాయో ఈ ఏడాది అదే తేదీకి అంతే అమ్మకాలు జరగాలి. డిస్టిలరీల్లో మద్యం తయారు చేసి బయటకు విక్రయించరు. అలా కొనుగోలు చేయాలంటే ఎక్సైజ్ కమిషనర్ అనుమతి తప్పనిసరి. డిస్టిలరీల నుంచి డిపోలకు అక్కడి నుంచి ప్రభుత్వ మద్యం దుకాణాలకు, బార్‌లకు మద్యం చేరుతుంది. అయితే మద్యం తయారీ డిస్టిలరీల్లో 90శాతం వైసీపీ నేత చేతుల్లో ఉన్నాయనే విషయం జగద్విదితం. లెక్కల్లో చూపించకుండా తయారు చేసిన మద్యాన్ని డిస్టిలరీల నుంచి నేరుగా నాయకుల ఇళ్లకు చేర్చారని చెబుతున్నారు. పోలింగ్ రోజు, అంతకు ముందు రోజు.. అంటే 11 సాయంత్రం 6 గంటల నుంచి 13వ తేదీ సాయంత్రం 7 గంటల వరకూ మద్యం దుకాణాలు మూతపడడంతో.. నిల్వ చేసిన ఆయా అభ్యర్థులు నిల్వ చేసిన మద్యాన్ని పంపిణీ చేసే కార్యక్రమం మొదలు పెడతారని తెలుస్తోంది. అలాగే.. నాటుసారాను కూడా గుట్టుగా పెద్ద ఎత్తున తయారు చేయించారని చర్చ నడుస్తోంది. సారాను అతి సులభంగా పంచే అవకాశం ఉండడంతో ఇప్పటికే తయారు చేసిన మద్యాన్ని ప్యాకెట్ల రూపంలో రహస్య ప్రదేశాల్లో ఉంచారని వినవస్తోంది.

ముగిసిన పోలింగ్ కేంద్రాల ర్యాండమైజేషన్

కలెక్టరేట్(కాకినాడ), మే 11: ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్ కేంద్రాల మూడో దశ ర్యాండమైజేషన్ ప్రక్రియను కలెక్టరేట్ ఎన్ఐసీ సెంటర్‌లో జిల్లా ఎన్నికల అధికారులు, జిల్లా కలెక్టర్ జె.నివాస్ జిల్లా పరిశీలకులు గణేష్, రాజేశ్ జోగ్‌పాల్ సమక్షంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జె.నివాస్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం, రాష్ట్ర ఎన్నికల కమిషన్ సూచనలకు అనుగుణంగా కాకినాడ పార్లమెంట్, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి మూడో దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ ద్వారా ఈనెల 13న జరిగే ఓటింగ్ ప్రక్రియలో పాల్గొనే పోలింగ్ సిబ్బందికి మొత్తం 1640 పోలింగ్ కేంద్రాలకు కేటాయింపు చేశామన్నారు. పీవో, ఏపీవో, ఓపీవో, మైక్రో అబ్జర్వర్లు ఇతర సిబ్బందికి 12న ఆయా నియోజకవర్గాల డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో పోలింగ్ సామాగ్రితోపాటు పోలింగ్ కేంద్రంలో విధులు నిర్వర్తించాలో తెలియజేస్తామన్నారు. పోలింగ్ సిబ్బంది అంతా ఆదివారం నిర్ణయించిన సమయానికి ఆయా డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు చేరుకోవాలన్నారు. ఎన్నికల విధులకు గైర్హాజరైతే వారిపై ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సీపీవో త్రీనాథ్, ఎన్ఐసీ ఐటీ డైరెక్టర్ సుబ్బారావు పాల్గొన్నారు.

పిఠాపురంలో మునిసిపల్ అధికారుల ఓవరాక్షన్

- జగన్ ప్రచారసభ సేవలో తరించిన అధికార గణం
- చిరువ్యాపారుల దుకాణాలు తొలగింపు.. ఎక్స్‌కవేటర్‌తో కూల్చివేత
- సీఎం సభకోసం మా పొట్ట కొడతారా అంటూ ఆగ్రహం

పిఠాపురం, మే 11: పిఠాపురంలో సీఎం జగన్ ఎన్నికల ప్రచార సభ నేపథ్యంలో పిఠాపురం మునిసిపల్ అధికారులు ఓవరాక్షన్ చేశారు. ప్రచారసభసేవలో అధికారగణమంతా తరించారు. సీఎం సభకు అడ్డుగా ఉన్నాయంటూ చిరువ్యాపారుల దుకాణాల ను తొలగించారు. పలుచోట్ల వారి సీడను ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. సీఎం సభకోసం మా పొట్టగొడతారా అంటూ చిరువ్యాపారులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎన్నికల ప్రచారం చివరిరోజున శనివారం మధ్యాహ్నం సీఎం జగన్ ప్రచార సభ ఏర్పాటు చేశారు. ఇది పూర్తిగా పార్టీ ప్రచార కార్యక్రమం అయినా పిఠాపురం మునిసిపల్ అధికారులు అడుగడుగునా సభసేవలో తరించారు. సభకు అడ్డుగా ఉన్నాయంటూ సభ జరిగే చిన్నమాంబపార్కువద్ద ఉన్న 20మంది చిరువ్యాపారులకు చెందిన దుకాణాలతో తొలగించారు. కొన్నింటిని ఎక్స్‌కవేటర్‌తో కూల్చివేశారు. ఈ వ్యవహారాన్ని మునిసిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది పర్యవేక్షించారు. ఏసమాచారం లేకుండా తాము వ్యాపారం చేసుకునే దుకాణాలను తొలగించడంపై చిరువ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం సభ కోసం మా పొట్టకొడతారాఅంటూ అధికారులపై మండిపడ్డారు. గత ఎన్నికల ముందు సీఎం హోదాలో చంద్రబాబు వచ్చారని, అప్పుడు తమ వ్యాపారాలు తాము చేసుకున్నామని వారు చెప్పారు. కాగా ప్రచార సభకు అవసరమైన ఏర్పాట్లు చేయడంలో మునిసిపల్ అధికారులు సహకరించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



పిఠాపురం ఉప్పాడ సెంటర్‌లో దుకాణాలను తొలగిస్తున్న అధికారులు

ప్రతిఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలి: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), మే 11: జిల్లాలో జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ జె.నివాస్ కోరారు. జిల్లాలో ఓటింగ్ అధికశాతం నమోదయ్యేందుకు కృషిచేయాలన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో ఓటుహక్కు వినియోగించుకునేందుకు ప్రజలందరూ ముందుకు రావాలన్నారు. ఓటుహక్కు వినియోగంలో ఎవరికైనా ఎటువంటి ఇబ్బంది కలిగిన కలెక్టర్ కార్యాలయం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నెంబర్ 18004253077కు ఫోన్ చేసి తమ సమస్యను తెలియజేయవచ్చునన్నారు. దీనిపై అధికారులు స్పందించి పరిష్కరిస్తామన్నారు. జిల్లాలో ప్రశాంతంగా, పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియను నిర్వహించేందుకు ఏర్పాటు పూర్తిచేశామన్నారు. జిల్లాలో ఓటర్ స్లిప్పుల పంపిణీ పూర్తి అయ్యిందన్నారు. పీడబ్ల్యూడీ ఓటర్లకోసం ప్రత్యేకంగా ఓటర్ గైడ్‌లను పంపిణీ చేశామన్నారు. 85ఏళ్ల దాటిన వృద్ధులకు, 40శాతం వైకల్యం దాటిన విభిన్న ప్రతిభావంతులకు హోమ్ ఓటింగ్ సౌకర్యాన్ని కల్పించామన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న సిబ్బంది అందరికీ పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌కు అవకాశాన్ని కల్పించామన్నారు. జిల్లాలో 16,34,122మంది ఓటర్లకు 1640 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో కనీస సదుపాయాలను కల్పించామన్నారు. ఎండనుంచి రక్షణకోసం టెంట్లు అవసరమైన కుర్చీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పోలింగ్‌బూత్‌లవద్ద వైద్యశిబిరాలను ఏర్పాటు చేశామన్నారు. దివ్యాంగులు, యువత, మహిళలకోసం మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల సామాగ్రిని తరలించేందుకు వినియోగించే వాహనాలను జీపీఎస్ ఏర్పాటు చేశామన్నారు. అంధులకోసం బ్రెయిలీలో నమూనా ఓటర్ల జాబితాను పోలింగ్ కేంద్రాలవద్ద ఏర్పాటు చేస్తున్నామన్నారు.

ద్వారంపూడి వారసుడిని ఎత్తుకుని.. ఓ ఆడబిడ్డ న్యాయం కోసం తిరుగుతోంది

- జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్య

కాకినాడ(ఆంధ్రజ్యోతి), మే 11: కాకినాడ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి వారసుడిని ఎత్తుకుని ఓ ఆడబిడ్డ న్యాయం కోసం తిరుగుతోందని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ(సత్య) తీవ్రంగా విమర్శించారు. కాకినాడలోని ఓ ప్రైవేట్ శనివారం హోటల్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ద్వారంపూడి ఎంత నీచుడో కాకినాడ ప్రజలకు, రాష్ట్ర ప్రజలకు తెలియాలన్నారు. ద్వారంపూడి ఓ దళిత మహిళతో అక్రమ సంబంధమో, సహ జీవనమో తెలియదు కానీ, ఆమె గర్భవతి అయినప్పుడు ఆమెను తీసుకెళ్లి స్కానింగ్ చేయించాడన్నారు. ఆ తర్వాత ఆమెకు డెలివరీ ఎక్కడ అయ్యింది, ఎప్పుడు అయ్యింది, ఆమెకు పుట్టిన బిడ్డకు తలనీలాలు ఆయన ఒళ్లో కూర్చోబెట్టుకుని తిరుపతిలో తీయించిన విషయాలు బయటకు వస్తున్నాయన్నారు. ఆ తర్వాత ఏడాదికాలంగా ఆమెను విపరీతంగా బెదిరింపులు చేస్తున్నాడని, ఎందుకంటే ఆమె పబ్లిక్‌గా తన లైఫ్ తనకు కావాలని, గుర్తింపు కావాలని కోరగా.. నీకు భార్యగా ఉండాలని అంటే అది కుదరదు, నువ్వు మూలన కూర్చునుండాలని ద్వారంపూడి బెదిరిస్తున్నాడన్నారు. ఆమె ఇంటి ముందు 28 కెమెరాలు పెట్టి ఆమెను ఇంట్లోంచి బయటకు రానీయకుండా గృహ నిర్బంధం చేయడం, కారులో డివైజర్ పెట్టి ఆమె ఎక్కడికి వెళుతుందో ట్రాప్ చేయడం, ఆమె ఎట్టిపరిస్థితిలో ఈ విషయాన్ని ఎవరికీ చెప్పకుండా చేయడానికి ఆయన చేస్తున్న ప్రయత్నాలు తెలుసన్నారు. దీన్ని రాజకీయంగా తీసుకోకుండా ఆ మహిళ తరఫున తాను, జనసేన పార్టీ అండగా ఉంటున్నామన్నారు. ఇలా దౌర్జన్యం చేసి బెదిరించడం చేస్తే చట్టపరంగా న్యాయం జరగాలని, ఆమె ఈ ఏడాది మార్చి 21న జిల్లా పోలీస్ సూపరింటెండెంట్‌కు స్వయంగా లేఖ ఇచ్చిన దాని మీద ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదన్నారు. కలెక్టర్‌గానీ, ఎస్పీ గానీ వీరందరూ కూడా ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఏం చేస్తే అదే అనే ఓ భయంకరమైన భావనలో ఉండిపోయారన్నారు. ద్వారంపూడి తాలూకు బిడ్డను పెంచి పోషిస్తున్న ఆ మహిళకు తప్పకుండా న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ఈ విషయంలో న్యాయపరమైన హక్కు ఉంటుందని, దళిత సంఘాలు చట్టపరమైన చర్యలు కోరాలని, వారికి తాము తోడుంటామని స్పష్టం చేశారు. ద్వారంపూడి విదేశాల్లో చేస్తున్న మైనింగ్స్ బయట పెడతామన్నారు. ఎక్కడ వేర్‌హౌస్‌లు కట్టారు, ఎవరి పేరున కట్టారు, ఎవరిని కాపాడుతున్నాడు అన్ని విషయాలు బయట పెడతామన్నారు. ఆయన సోదరుడి ఫ్యాక్టరీనుంచి వెలువడే వ్యర్థాల వల్ల చెరువుల్లో చేపలు చచ్చిపోతున్నాయని, వీటన్నింటిపై కూలంకుషంగా విచారణ చేయించి తగిన గుణపాఠం చెబుతామని అన్నారు.


పెదపూడిలో టీడీపీలోకి చేరిక



టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న దృశ్యం

కాకినాడ సిటీ, మే 11: పెదపూడి మండలంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. అనపర్తి నియోజకవర్గం ఎన్డీయే అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రాజానగరం నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పెదపూడి వైసీపీ సీనియర్ నాయకుడు యార్లగడ్డ లక్ష్మీకాంతం నారాయణరావు, కొండేటి వీర రాఘవులు, కాకర లక్ష్మీరాయుడు, ఆప్షన్ లక్ష్మణ్, పుట్టా ప్రసాద్ వారి అనుచరులు, పది కుటుంబాల వారు టీడీపీలో చేరారు. వీరికి నల్లమిల్లి, బొడ్డు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో పెదపూడి మండలం, గ్రామ ఎన్డీయే నాయకులు పాల్గొన్నారు.





జనసేన పార్టీ

తెలుగు ప్రజలారా మీరు ఎటువైపు?

ధర్మం - అభివృద్ధి వైపా?
ధనం - అహంకారం వైపా?

తేల్చుకునే సమయం వచ్చింది.

కూటమికి ఓటేద్దాం!
తెలుగు జాతిని గెలిపిద్దాం!!



శ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్ గారు
పిఠాపురం అసెంబ్లీ అభ్యర్థి

గాజు గ్లాసు
గుర్తుకే మన ఓటు

శ్రీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ గారు
(TEA TIME ఉదయ్)
కాకినాడ పార్లమెంట్ అభ్యర్థి

శృంగారవల్లభస్వామి ఆలయంలో రద్దీ

పెద్దాపురం, మే 11: మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.2,55,790, అన్నదాన విరాళాలు రూ.66,868, కేశఖండన ద్వారా రూ.8,600, తులాభారం రూ.350, కానుక ద్వారా రూ.2,800 వెరసి రూ.3,34,408 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. సుమారు 12 వేలమంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

అన్ని విధాలా కాకినాడను అభివృద్ధి చేస్తా

» ఏడీబీ రహదారిని త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తా » కాకినాడ పార్లమెంట్ జనసేన-టీడీపీ-బీజేపీ కూటమి అభ్యర్థి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్

కార్పొరేషన్ (కాకినాడ), మే 11: అన్ని విధాలుగా కాకినాడను అభివృద్ధి చేస్తానని కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ జనసేన-టీడీపీ-బీజేపీ కూటమి అభ్యర్థి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ హామీనిచ్చారు. కాకినాడలో శనివారం జనసేన అధినేత పవన్‌కల్యాణ్ నిర్వహించిన సభలో ఉదయ్‌శ్రీనివాస్ మా ట్లాడుతూ నేను ప్రజల్లో తిరిగే ఒక మధ్యతరగతి యువకుడిని. మీ ఇంట్లో ఉండే ఒక అన్నయ్యని, ఒక తమ్ముడిని ఒక బిడ్డని. చంద్రబాబు, పవన్ నాయకత్వంలో కాకినాడ పార్లమెంటు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇస్తున్నానన్నారు. రాజకీయాలకు రాకముందే టీటైం ఉదయ్‌గా 25వేల మందికి ఉపాధి కల్పించిన చిన్న వ్యాపార వేత్తనన్నారు. అలాగే 1100 మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దిన యువకుడిని అన్నారు. మరో 600మందితో ప్రైవేట్ ఎంప్లాయిమెంట్ వింగ్ ఏర్పాటు చేసి ఆయా గ్రామాల్లో ఖాళీగా ఉన్న నిరుద్యోగులకు ఉద్యోగల అవకాశాలపై అవగాహన కలిస్తూ ఎంప్లాయిమెంట్ ఇస్తూ ముందుకు వెళ్తున్నాను. కాకినాడ పోర్టును అభివృద్ధి చేసి మోడల్ చేసి అక్కడ యువతకి ఉపాధి అవకాశాలు కల్పిస్తానన్నారు. కాకినాడ పోర్టు నుంచి ఎయిర్పోర్ట్‌కి వెళ్లే ఏడీబీ రహదారిని త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తానన్నారు. కాకినాడ బీచ్‌ని పర్యాటక రంగంలో ప్రథమ స్థానంలో ఉండేలా తీర్చిదిద్దుతానన్నారు. కాకినాడ ఎస్‌సిజడ్‌లో పరిశ్రమలను తీసుకువచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. పవన్, మోదీ సహకారంతో కాకినాడను అన్నివిధాల అభివృద్ధి చేస్తానన్నారు. ఈనెల 13న జరిగే ఎన్నికల్లో ప్రజలు కూటమి అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.


కాకినాడ సభలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి ఉదయ్‌శ్రీనివాస్

వైసీపీని ఓడించాలి

కూటమికే దళితుల మద్దతు పోస్టర్లను ఆవిష్కరించిన ఉదయ్‌శ్రీనివాస్

కార్పొరేషన్ (కాకినాడ), మే 11: దళితులను మోసం చేసిన వైసీపీని ఎన్నికల్లో ఓడించి తగిన బుద్ధి చెప్పాలని దళిత వర్గాల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చెట్టే రాజు అన్నారు. శనివారం కాకినాడ నగరంలోని జనసేన పార్టీ కార్యాలయంలో కూటమి అభ్యర్థులకే దళితుల మద్దతు పోస్టర్లను కూటమి ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చెట్టే రాజు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ జరగాలంటే బీజేపీ-టీడీపీ-జనసేన కూటమి అధికారంలోకి రావాలని... కూటమి గెలుపునకు దళితులు అండగా నిలవాలని కోరారు. దళిత నాయకులు గాలింకి పవన్, నందికోళ్ల సురేష్, కొల్లి చైతన్య, రేపు విజయ్, కోడి సుజ్ఞాన్ పాల్గొన్నారు.


కూటమికే దళితుల మద్దతు పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎంపీ అభ్యర్థి ఉదయ్‌శ్రీనివాస్

సత్యదేవుడి దివ్యకల్యాణోత్సవ ఏర్పాట్లపై సమీక్ష


కల్యాణోత్సవ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహిస్తున్న ఈవో

అన్నవరం, మే 11: ఈనెల 18 నుంచి ప్రారంభంకానున్న సత్యదేవుడి దివ్యకల్యాణోత్సవ ఏర్పాట్లపై శనివారం ఈవో రామచంద్రమోహన్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రధానంగా 19న రాత్రి జరిగే దివ్యకల్యాణోత్సవం సందర్భంగా ప్రత్యక్షంగా వీక్షించే భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, ఏర్పాట్లపై చర్చించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ఈవో ఆదేశించారు. కల్యాణం వీక్షించేందుకు ప్రముఖులు, భక్తులకు ప్రత్యేక గ్యాలరీల ఏర్పాటు, కల్యాణం అనంతరం అక్షింతల తలంబ్రాల పంపిణీలో ఎటువంటి అసౌకర్యం కలగకుండా నాలుగుచోట్ల పంపిణీకి సంబంధించి క్యూ ఏర్పాటు తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో పీఆర్వో కృష్ణారావు, ఇంజనీరింగ్ అధికారులు నరసింహరావు, బాలమురళీ, వివిధ విభాగాల ఏఈవోలున్నారు.

రౌతులపూడిలో అన్నదానం

రౌతులపూడి, మే 11: రౌతులపూడిలో చినవేములతల్లి, పెద వేములతల్లి ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం గంధామావాస్యను పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహింగా అధిక సంఖ్యలో ప్రజలు హాజరై అన్నదానం స్వీకరించారు.

'వైసీపీ హయాంలో బీసీలకు తీవ్ర అన్యాయం'

కాకినాడ సిటీ, మే 11: కాకినాడ సిటీలో బీసీలకు వైసీపీ హయాంలో తీవ్ర అన్యాయం జరిగిందని, వారికి చెందిన స్థలాలను కబ్జా చేశారని బీసీ కుల, చేనేత కుల సంఘాల నాయకులు పేర్కొన్నారు. శనివారం స్థానిక కాస్మో పొలిటిన్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. గత 2002లో టీడీపీ ప్రభుత్వ హయంలో ఆర్ఆర్ నగర్ ప్రాంతంలో చేనేత సామాజిక వర్గం కమ్యూనిటీ హాల్ కోసం కేటాయించిన 3 వేల గజాల స్థలాన్ని చేనేతలకు చెందకుండా సాంకేతిక కారణాలు చూపుతూ వైసీపీ ప్రజాప్రతినిధులు అడ్డుకుని దానిని ఇవ్వకుండా చేసి కొత్తగా 1050 గజాల స్థలాన్ని ఇచ్చి చేనేతలను మోసం చేశారన్నారు. అలాగే డెయిరీఫారమ్ వాటర్ ట్యాంక్ వద్ద ఉన్న మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన 2 వేల గజాల సామాజిక భవన స్థలాన్ని వైసీపీ నాయకుడు కబ్జా చేయడానికి ప్రయత్నించి దానిని మత్స్యకార సంఘాలు, ప్రజా సంఘాలు అడ్డుకోవడంతో మత్స్యకార కులాల మధ్య చిచ్చుపెట్టి ఆ స్థలంలో ఫిష్ నవ్యాంధ్ర కంటైనర్ పెట్టి కమ్యూనిటీ భవనం నిర్మించకుండా మత్స్యకారులకు అన్యాయం చేశారన్నారు. గత 2018 టీడీపీ ప్రభుత్వ హయంలో చీడీలపోర ప్రాంతంలో పూలే భవనం కోసం కేటాయించిన రెండు ఎకరాల స్థలానికి ఇప్పటి వరకు హద్దులు చూపకుండా కబ్జా చేయడానికి ప్రయత్నించారన్నారు. అలాగే శెట్టిబలిజ, యాదవ, విశ్వబ్రాహ్మణ, నాయిబ్రాహ్మణ సామాజిక వర్గాలకు స్థలాలు కేటాయించలేదని, కేటాయించిన సామాజిక వర్గాలకు కమ్యూనిటీ భవనాలు నిర్మించలేదని విమర్శించారు. బీసీలందరూ ఈ ఎన్నికల్లో కూటమి సిటీ అభ్యర్థి వనమాడి కొండబాబుకు సైకిల్ గుర్తుపైన, ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌కు గ్లాసు గుర్తుపైన ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏపీ బీసీ ఫెడరేషన్ రాష్ట్ర సమన్వయకర్త పప్పు దుర్గా రమేష్, ధన్వంతరి నాయిబ్రాహ్మణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సుందరపల్లి గోపాలకృష్ణ, శెట్టిబలిజ సంఘం నాయకుడు గుత్తుల రమణ, యాదవ సంఘం నాయకుడు కొల్లుబోయిన శ్రీనివాసయాదవ్, అగ్నికుల క్షత్రియ యూత్ ఫోర్స్ నాయకుడు కొక్కిలిగడ్డ గంగరాజు, వివిధ సంఘాల నాయకులు ఉన్నారు.

అండగా ఉంటా... ఆశీర్వదించండి

తుని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి యనమల దివ్య

తుని రూరల్, మే 11: అండగా ఉంటాను ఆశీర్వదించాలంటూ టీడీపీ కూటమి తుని ఎమ్మెల్యే అభ్యర్థి యనమల దివ్య కోరారు. తేటగుంటలో తుని మాజీచైర్‌పర్సన్ కూసుమంచి శోభారాణి ఆధ్వర్యంలో శనివారం పెద్దఎత్తున మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యనమల దివ్య మాట్లాడుతూ మహిళలకు శక్తిని ప్రోత్సహించేందుకు తోడ్పాటునిస్తానని, మహిళా డిగ్రీ కళాశాల, నర్సింగ్ కళాశాల ఏర్పాటుకు హామీఇచ్చారు. ఎన్నికల్లో తనకు అత్యధికంగా మెజార్టీ వచ్చేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆమె కోరారు.


తేటగుంటలో మహిళలతో మాట్లాడుతున్న దివ్య

ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ఓటు వేయాలి

రాష్ట్ర పెరిక సాధికార సమితి కన్వీనర్ వనపర్తి బద్రి


సమావేశంలో మాట్లాడుతున్న వనపర్తి బద్రి

కాకినాడ సిటీ, మే 11: ఓటు వినియోగంతోనే బీసీల తలరాతలు మారుతాయని, ఎన్నికల్లో టీడీపీ- జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థులకు ఓటు వేయాలని రాష్ట్ర పెరిక పురగిరి క్షత్రియ సాధికార సమితి కన్వీనర్ వనపర్తి బద్రి కోరారు. శనివారం కాకినాడలోని జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్ల జగన్ పాలనలో బీసీలు అణచివేతకు, హత్యారాజకీయాలకు బలి అయ్యారన్నారు. పలు బీసీ పథకాలు రద్దు చేశారని, దగా పడ్డ బీసీలు జగన్‌రెడ్డికి వ్యతిరేకంగా ఓటు వేసి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రతి బీసీ సామాజిక వర్గ ప్రజలు ఈనెల 13న ఎండ, శ్రమ అనుకోకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థులకు ఓటు వేసి అస్తవ్యస్థమైపోయిన ఆంధ్రప్రదేశ్‌ను కాపాడుకోవాలని బద్రి పిలుపునిచ్చారు. కాకినాడ పార్లమెంట్ టీడీపీ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి కొల్లుబోయిన శ్రీనివాస యాదవ్, కాకినాడ టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు వొమ్మి బాలాజీ, జిల్లా టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు గదుల సాయిబాబు పెరిక సాధికార సమితిసభ్యుడు తివిరిశెట్టి సతీష్ పాల్గొన్నారు.

బాలాజీచెరువు సెంటర్‌లో పవన్ సభ దైవ సంకల్పం

» ద్వారంపూడి పతనం ఇక్కడి నుంచే ఆరంభం » కాకినాడ సిటీ అసెంబ్లీ టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబు


సభలో మాట్లాడుతున్న వనమాడి కొండబాబు, పాల్గొన్న పవన్‌కల్యాణ్, తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్

కాకినాడ సిటీ, మే 11: ఇదే స్థలంలో చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్‌లను గతంలో ద్వారంపూడి మాట్లాడకూడని మాటలు మాట్లాడానని, ఇదే బాలాజీచెరువు సెంటర్‌లో పవన్‌కల్యాణ్ సభకు అనుమతి ఇవ్వడం దైవ సంకల్పమని, ఈ సభ ద్వారా ద్వారంపూడి పతనం ఇక్కడి నుంచే ఆరంభం అయ్యిందని కాకినాడ సిటీ అసెంబ్లీ టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబు పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం సాయంత్రం కాకినాడ బాలాజీచెరువు సెంటర్‌లో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సభ నిర్వహించారు. ఈ సభలో తొలుత కొండబాబు మాట్లాడుతూ ఈ నెల 11న కాకినాడ వస్తానని పవన్‌కల్యాణ్ గత నెల 18నే ప్రకటించారన్నారు. దీంతో పవన్‌కల్యాణ్ సభకు స్థలం లేకుండా చేయాలని కాకినాడలోని అన్ని సెంటర్లు కావాలని ద్వారంపూడి అనుమతి తెచ్చుకున్నాడన్నారు. పవన్ కల్యాణ్ సభ అనుమతి కోసం రాత్రి 2 గంటల వరకు ఇబ్బంది పెట్టి ఎట్టకేలకు బాలాజీచెరువు సెంటర్‌లో అనుమతి ఇచ్చారన్నారు. కాకినాడ గతంలో స్మార్ట్‌సిటీగా ఉండేదని, ఈ రోజున గంజాయి సిటీ, డ్రగ్స్ సిటీ, గూండాల సిటీ, రౌడీల సిటీగా అయిపోయిందన్నారు. కాకినాడను కాపాడాల్సిన బాధ్యతపై మొన్ననే చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారని, ఈ రోజున పవన్‌కల్యాణ్ హామీతో కాకినాడ ప్రజలు సుభిక్షంగా ఉండనున్నారన్నారు. పవన్‌కల్యాణ్ రాక కోసం కాకినాడ ప్రజలే కాదు, ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. దత్తపుత్రుడు, దత్తపుత్రుడు అని పవన్‌కల్యాణ్‌ను చాలా మంది మాట్లాడుతున్నారని, పిఠాపురంలో ఉండే దైవం దత్తాత్రేయుడే అక్కడి నుంచి పోటీ చేసేందుకు పవన్‌కల్యాణ్‌ను రప్పించుకున్నారన్నారు. చంద్రబాబునాయుడు మద్దతు, పవన్‌కల్యాణ్ మద్దతుతో ఆంధ్ర రాష్ట్రంలో దుర్మార్గుడి పాలనను అంతమొందించి ఈ ఎన్నికల్లో గొప్ప విజయం సాధించబోతున్నామని కాకినాడ సిటీ కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబు పేర్కొన్నారు.

'కొండబాబు విజయం ఖాయం'

కాకినాడ సిటీ, మే 11: ఎన్నికల్లో కాకినాడ సిటీ కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబు భారీ మెజారిటీతో విజయం సాధించడం ఖాయమని కాకినాడ సిటీ టీడీపీ ఎన్నికల కోఆర్డినేటర్ వనమాడి ఉమాశంకర్ పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారం గడువు ముగుస్తున్న తరుణంలో ఆయన ప్రచార వివరాలను తెలియజేశారు. ఉమ్మడి కార్యాచరణతో కాకినాడ నగరంలోని 43 డివిజన్లలో పార్టీశ్రేణులు, కూటమి పక్షాలను కలుపుకుని విజయవంతంగా ప్రచారం పూర్తి చేశారన్నారు. ఎక్కడికక్కడ ప్రజల నుంచి అభ్యర్థి కొండబాబుకు విశేష స్పందన లభించిందన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రావాలని అన్ని వర్గాల ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. ఎన్నికల ప్రచారం ప్రారంభం నుంచి ఇప్పటి వరకు కూటమి పక్షాల నాయకులు, శ్రేణులు పూర్తి సహకారం అందించారన్నారు. ప్రజలలో కనిపిస్తున్న ఆసక్తి చూస్తుంటే 2019 ఎన్నికల కంటే ఈ సారి ఓటింగ్ శాతం గణనీయంగా పెరుగనుందన్నారు. కూటమి అంటే ఏమిటో చూపేలా స్నేహితులం, కుటుంబ సభ్యులందరం విస్తృతంగా ప్రచారం సాగించామన్నారు. ఈ ఎన్నికల్లో అద్భుత ఫలితాలు రాబోతున్నాయని ఉమాశంకర్ పేర్కొన్నారు.

మీ ఇంటి బిడ్డను ఆశీర్వదించండి

ప్రత్తిపాడు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సత్యప్రభ


ప్రత్తిపాడులో సత్యప్రభ సమక్షంలో టీడీపీలో చేరికలు


ప్రత్తిపాడు సమావేశంలో మాట్లాడుతున్న సత్యప్రభ

ప్రత్తిపాడు, మే 11: మీ ఇంటి బిడ్డను ఆశీర్వదించండి. దివంగత టీడీపీ నేత అయిన నా భర్త వరుపుల రాజా సేవలను గుర్తించి ఆయన ఆశయ సాధనలో భాగస్వాములు అవ్వండి అంటూ ప్రత్తిపాడు కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభ రాజా కోరారు. ఎన్నికల ప్రచార ముగింపు రోజైన శనివారం స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద అన్నవరానికి చెందిన వైసీపీ నాయకులు గల్లా దాసు, చింతపల్లి జోన్2తదితరులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారికి సత్యప్రభ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఆమె మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయాలని తన భర్త రాజా కలలు కన్నారని, ఆయన కలల సహకారానికి తాను అంకితభావంతో సేవ చేయాలనే లక్ష్యంతో ప్రజాక్షేత్రంలోకి వచ్చానని తెలిపారు. సాగునీరు, తాగునీరు, రహదారుల నిర్మాణం, ప్రజలకు విద్య వైద్యం, అందుబాటులోకి తీసుకొచ్చి యువత నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలుకల్పించి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథకం వైపు నడిపించేలా కృషి చేస్తానని ఇందుకు ప్రజలు సోమవారం జరిగే ఎన్నికల్లో పెద్ద మనస్సుతో తనకు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి దీవించాలని కోరారు.

సాయి తర్షిత్ ప్రచారం

వంతాండ గిరిజనగ్రామంలో శనివారం సత్యప్రభ తనయుడు సాయి తర్షిత్ ఎన్నికలప్రచారం నిర్వహించారు. గిరిజన మహిళలు ఘన స్వాగతం పలికి పూలమాలలతో హారతులు పట్టారు. సత్యప్రభ కుమారుడు సాయితర్షిత్, కుమార్తెసత్య మాధురిలు నియోజకవర్గంలో చైతన్యరథంపై రోడ్‌షో నిర్వహించి ఎన్నిక ల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు.


ఎన్నికల ప్రచారంలో సత్యప్రభ, తనయుడు, కుమార్తె

బాధ్యతాయుతంగా పని చేయాలి

పోలింగ్ ఏజెంట్లు బాధ్యతాయుతంగా పని చేయాలని వరుపుల సత్యప్రభ రాజా చెప్పారు. శనివారం సాయంత్రం స్థానిక సరయు ఫంక్షన్ హాల్లో నిర్వహించిన పోలింగ్ ఏజెంట్ల శిక్షణా శిబిరంలో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడుతూ ప్రతి ఓటు కీలకం అన్న విషయం గుర్తించుకుని పోలింగ్‌ఏజెంట్లు పని చేయాలన్నారు. పోలింగ్ బూతుల్లో ఎలాంటి వివాదాలు జరగకుండా ఓటర్లు ఓటు వినియోగించుకునేలా ఏజెంట్లు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. నియోజకవర్గ పరిశీలకులు దాసరి సత్యనారాయణ, దీపక్, కొండపల్లి శ్రీనివాస్ ఉన్నారు.


కాకినాడలో పవన్‌తో మాట్లాడుతున్న నెహ్రూ

పవన్‌ను కలిసిన జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట, మే 11: కాకినాడలో శనివారం జనసేన అధినేత పవన్‌కల్యాణ్ బహిరంగ సభ నిర్వహించారు. సభ అనంతరం జగ్గంపేట నియోజకవర్గ టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ పవన్‌ని కలిసి జగ్గంపేట నియోజకవర్గంలో ఎన్నికల పరిస్థితిని వివరించారు. పవన్‌కల్యాణ్ నెహ్రూతో మాట్లాడుతూ జగ్గంపేట నుంచి మంచి మెజార్టీతో గెలిచి రావాలని, ఎంపీ అభ్యర్థి ఉదయ్‌శ్రీనివాస్‌కు మంచి మెజార్టీ తీసుకురావాలని కూటమి అధికారం రావడానికి మీ నుంచి నాంది పలకాలని అన్నారు. నియోజకవర్గంలో జనసైనికులు, వీర మహిళలు, ఎంతోకష్టపడి పని చేసి టీడీపీ నాయకుల సమన్వయంతో ఎన్నికల్లో మంచి మెజార్టీ సాధించి కూటమి జెండాలు ఎగురవేస్తామని, ఎంపీ అభ్యర్థి కూడా మంచి మెజార్టీవస్తుందని నెహ్రూ పేర్కొన్నారు.

'జ్యోతుల నెహ్రూను గెలిపించాలి'

గండేపల్లి, మే 11: జగ్గంపేట కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూను గెలిపించి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని గండేపల్లి టీడీపీ మండలాధ్యక్షుడు పోతుల మోహనరావు కోరారు. శనివారం ఆయన గండేపల్లిలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. నెహ్రూకు ఇవే చివరి ఎన్నికలని, ఆయన్ను గెలిపిస్తే ప్రజలంతా చిరస్థాయిగా గుండెల్లో పెట్టుకునే విధంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తారన్నారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి నెహ్రూను, గాజుగ్లాసు గుర్తుపై ఓటేసి ఎంపీగా తంగెళ్ల ఉదయశ్రీనివాస్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. వెలమాటి కాశీ, బొల్లంరెడ్డి రామకృష్ణ, కంటిపూడి రామారావు, వెంపాటి రాజు, ఆళ్ల సత్తిబాబు, పైలా వెంకన్న, చిటికెల కన్నబాబు, దారా కాటయ్య, వెంపాటి సతీష్, లంజపల్లి రామకృష్ణ, జీవీ రమణ, సూర్యారావు, సతీష్ పాల్గొన్నారు.

జగ్గంపేటలో రామ్‌చరణ్

జగ్గంపేట, మే 11: శనివారం మధ్యాహ్నం తన బాబాయ్ పవన్‌కల్యాణ్ కోసం సినీనటుడు రామ్‌చరణ్ పిఠాపురం వెళుతున్న సమయంలో మార్గమధ్యలో జగ్గంపేట జాతీయ రహదారికి కృష్ణవేణి సెంటర్ నందు జనసైనికులు మెగా ఫ్యామిలీ ఫ్యాన్స్ ఆయన కోసం ఎదురుచూశారు. దీంతో రామ్‌చరణ్ తన వాహనం ప్రజలందరికీ అందరికీ అభివాదం చేశారు.


ఫ్యాన్స్‌కు అభివాదం చేస్తున్న రామ్‌చరణ్

'వైసీపీకి ఓటు వేయవద్దు'

పిఠాపురం, మే 11: కాపులకు అన్ని విధాల ద్రోహం చేసిన జగన్‌కు బుద్ధి చెప్పేందుకు ఎన్నికల్లో వైసీపీకి ఓటు వేయవద్దని కాపు, తెలగ, బలిజ, ఒంటరి, జేఏసీ రాష్ట్ర కన్వీనర్ వాసిరెడ్డి ఏసుదాసు పిలుపునిచ్చారు. పిఠాపురం టీడీపీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ తాము చేసిన కాపు ఉద్యమ ఫలితంగా అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఎఫ్ కేటగిరీలో ఈబీసీలో ఐదుశాతం రిజర్వేషన్ ఇస్తే దానిని జగన్ తొలగించారని విమర్శించారు. కాపు భవనాల నిర్మాణాలను నిలిపివేశారని, వైసీపీ పాలనలో కాపులకు అన్ని విధాలా అన్యాయం జరిగిందన్నారు. పిఠాపురంలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను లక్ష మెజార్టీతో మాజీ ఎమ్మెల్యే వర్మ గెలిపించబోతున్నారని చెప్పారు. కాపులతో ఇతర జాతుల ప్రయోజనాలను పవన్ కాపాడతాడని తెలిపారు. కాపులంతా కూటమి అభ్యర్థులకే ఓటు వేయాలని కోరారు.

పవన్‌కు టీడీపీ నాయకుల స్వాగతం

సర్పవరం జంక్షన్, మే 11: కాకినాడకి ఎన్నికల ప్రచారంలోకి విచ్చేసిన జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి ఏసుదాసు ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. శనివారం ఉదయం రమణయ్యపేటలోని స్వగృహం నుంచి కార్ల ర్యాలీగా పార్టీ కార్యకర్తలు పిఠాపురం తరలివెళ్లారు. పి.వెంకటాపురం వద్ద పవన్‌కు ఘన స్వాగతం పలికారు. అక్కడ నుంచి ర్యాలీగా కాకినాడ సిటీకి తరలివెళ్లారు. ముందుగా జనసేన కాకినాడ రూరల్ కూటమి అభ్యర్థి పంతం నానాజీ, ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్‌లకు మద్దతుగా కాకినాడ రూరల్ మండల పరిధిలోని వాకలపూడి, వలసపాకల, రమణయ్యపేట, తిమ్మాపురం, పండూరు, సూర్యారావుపేట తదితర గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులున్నారు.

కూటమి అధికారంలోకి వచ్చేందుకు మద్దతివ్వాలి

కాకినాడ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి పంతం నానాజీ

కాకినాడ రూరల్, మే 11: రాష్ట్రం అభివృద్ధి, ప్రజాశ్రేయస్సు దృష్ట్యా టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అధికారంలోకి వచ్చేందుకు మద్దతు ఇవ్వాలని కాకినాడ రూరల్ జనసేన కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) కోరారు. శనివారం కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీ క్రీడా మైదానం, జేఎన్టీయూకే క్రీడామైదానాల్లో వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల జగన్ పాలనలో అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశారన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం టీడీపీ-జనసేన పొత్తు పెట్టుకుందన్నారు. సమర్థవంతమైన పాలన కోసం చంద్రబాబు, పవన్, బీజేపీ కూటమి అభ్యర్థులకు మద్దతు ఇచ్చి గెలిపించాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం చారిత్రక అవసరమన్నారు. ఎమ్మెల్యేగా అవకాశం కల్పిస్తే క్రీడామైదానాల్లో వాకర్స్ సంక్షేమం కోసం పలు మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. గాజుగ్లాసు గుర్తుపై ఓట్లేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్‌లను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. అనంతరం కాకినాడ అర్బన్ డివిజన్‌లో ప్రచారం నిర్వహించారు.



డాక్టర్స్, వాకర్స్‌తో మాట్లాడుతున్న పంతం నానాజీ, ఓట్లు అభ్యర్థిస్తున్న పంతం నానాజీ

జనసేనలో 50 మంది చేరిక

కాకినాడ రూరల్ సూర్యారావుపేటకు చెందిన జనసేన నాయకుడు చిన్న ఆధ్వర్యంలో 50 మంది వైసీపీ కార్యకర్తలు శుక్రవారం వలసపాకల పార్టీ కార్యాలయంలో జనసేనలో చేరారు. వీరికి కాకినాడ రూరల్ అభ్యర్థి పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

ప్రతీ ఒక్కరూ ఓటు వేయాలి

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం బాధ్యత కలిగిన ప్రతీ ఒక్కరూ ఓటు వేయాలని జనసేన కూటమి కాకినాడ రూరల్ అభ్యర్థి పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) పిలుపునిచ్చారు. శుక్రవారం వలసపాకల గంగరాజునగర్‌లో పార్టీ కార్యాలయం లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్ల వైసీపీ పాలన బేరీజు వేసుకుని ప్రజలకు మంచి చేయాలనే తలంపుతో ఏర్పడిన టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వానికి మద్దతివ్వాలని కోరారు. ఈవీఎం మిషన్‌లో ఓటు వేసే విషయంపై అవగాహన కల్పించారు. కూటమికి మద్దతు ఇచ్చే వాళ్లంతా ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ విజయం కోసం గాజుగ్లాసు గుర్తుపై బటన్ నొక్కాలని ఆయన కోరారు.


ఈవీఎంపై వివరిస్తున్న పంతం నానాజీ

'కూటమి అభ్యర్థులను గెలిపించండి'

కోటనందూరు, మే 11: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని తుని మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు కోరారు. శనివారం మండలంలోని బీమవరపుకోట గ్రామంలో మాజీ జడ్పీటీసీ పెంటకోటభాస్కరసత్యనారాయణ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. అవినీతి, అరాచక, భూకబ్జాలకు పాల్పడి ప్రజలను పీడించిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ డి.చిరంజీవిరాజు, డి.శివబాబు, అచ్యుతరామరాజు, మేరపురెడ్డి జోగిబాబు, అల్లంపల్లి నరసింహమూర్తి, డిగోపి, పృధ్వీ, సంజీవరావు, చంటిరాజు ఉన్నారు.